క్లుప్తంగా

వేతనజీవులను విస్మరించారు..

సీతంపేట: సాధారణంగా బడ్జెట్ ప్రవేశపెడుతున్నారంటే వేతనాలు పెరుగుతాయని ఆశించే వేతనజీవులకు నిరాశే మిగిలిందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎటువంటి జీఓ ఇవ్వకుండా మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు అంగన్‌వాడీలకు గ్రాట్యుటీ అమలు చేసిన ఘనత తమదేనని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ముఠా కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక బోర్డు ఏర్పాటు హామీ ప్రస్తావించలేదన్నారు.

నేటి నుంచి జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం కార్యక్రమాలు

గుమ్మలక్ష్మీపురం: జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం కార్యక్రమాలు శనివారం నుంచి నిర్వహిస్తున్నట్లు స్థానిక వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పి.లక్ష్మణరావు ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. మార్చి 30వ తేదీ వరకు జరిగే ఈ కార్యక్రమాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు, ఆవుదూడ(ఆడది)లకు బ్రూసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాలు వేయడం జరుగుతుందన్నారు. పాడిరైతులు, పశువుల పెంపకందారులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

దొంగతనాలపై డ్రోన్‌తో నిఘా



డ్రోన్ ఆపరేట్ చేస్తున్న దేముడుబాబు

గరుగుబిల్లి: దొంగతనాల నివారణకు డ్రోన్‌తో నిఘా పెడుతున్నట్లు ఎస్ఐ పి.రమేష్‌నాయుడు తెలిపారు. సీతానగరం, గరుగుబిల్లి, బలిజిపేట మండలాల పరిధిలో గొలుసు దొంగతనాలకు పాల్పడిన వ్యక్తిని పట్టుకోవడానికి ఎస్పీ ఆదేశాల మేరకు డ్రోన్‌ల ద్వారా గాలిస్తున్నట్లు పేర్కొన్నారు. దొంగతనానికి పాల్పడుతున్న వ్యక్తి నల్లని పల్సర్ బైక్‌పై ముఖానికి మాస్క్ ధరించి, హెల్మెట్ పెట్టుకుని గ్రామీణ ప్రాంతాల్లో ఒంటరిగా తిరిగే మహిళల మెడలోని బంగారం గొలుసులు లాక్కొని పారిపోతున్నాడని తెలిపారు. ఎవరైనా బండి లిఫ్ట్ ఇస్తానంటే ఎక్కవద్దని సూచించారు. పేకాటశిబిరాలు, సారా తయారీ, తరలింపుపై సమాచారం ఇవ్వాలంటే 100, 112 టోల్‌ఫ్రీ నంబర్లను సంప్రదించాలని, సమాచారం ఇచ్చిన వారికి పారితోషికం కూడా ఇస్తామన్నారు.

సమస్యలపై దృష్టి సారించండి

- ఎంపీడీఓ రంగారావు



సచివాలయ సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంపీడీఓ రంగారావు

పాలకొండ రూరల్: ప్రస్తుత వేసవి సీజన్‌లో సచివాలయ సిబ్బంది క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని ఎంపీడీఓ వీవీ రంగారావు అన్నారు. మండలంలోని సింగన్నవలస సచివాలయ పరిధి మల్లమ్మగూడ సమీపంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి గిరిజనులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సచివాలయాన్ని సందర్శించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. తాగునీటి వనరులు, పారిశుధ్య పనుల నిర్వహణపై ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి



వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్‌వో భాస్కరరావు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందివ్వాలని డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు సూచించారు. కురుపాం మండలంలోని మొండెంఖల్లు, నీలకంఠాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆయన శుక్రవారం సందర్శించారు. సిబ్బంది పనితీరు, రికార్డులు, మందుల నిల్వలపై ఆరాతీశారు. అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రికి వస్తున్న వారికి సకాలంలో వైద్యసేవలు అందించి, వారిని ఆరోగ్యవంతులను చేయాలని తెలిపారు. ఆయన వెంట వైద్యులు అభినవ్‌కుమార్, అమరసింహా రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆందోళన వీడి.. ఆరోగ్యంపై దృష్టి పెట్టండి



సీతంపేట బాలుర ఆశ్రమ పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు సూచనలిస్తున్న పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి (ఫైల్)

- మానసిక ప్రశాంతతతో పరీక్షలకు హాజరు కావాలి
- మార్చి 17 నుంచి పదో తరగతి పరీక్షలు
- ఆరోగ్య నియమాలు తప్పనిసరి : వైద్యులు

సీతంపేట: విద్యార్థుల బంగారు భవిష్యత్ పదో తరగతి మార్కులపైనే ఆధారపడి ఉంటుంది. పది మార్కులే వారి ఉన్నత చదువులకు దిశ, దశను నిర్దేశిస్తాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని విద్యార్థులు పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతుంటారు. ఈ ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 17 నుంచి ప్రారంభమవుతాయి. మొత్తం 212 పాఠశాలలకు గాను 67 పరీక్ష కేంద్రాలలో 10,445 మంది టెన్త్ విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు రాయనున్నారు. సాధారణంగా పది పరీక్షలంటే ఇటు విద్యార్థులకు అటు తల్లిదండ్రులకు కూడా ఆందోళనగా ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో మానసిక ఒత్తిడికి గురవుతుంటారు. మరోపక్క ఎండ తీవ్రత కూడా ఎక్కువగా ఉంటుంది. ఇవన్నీ విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభావం చూపే అవకాశాలు ఉన్నాయంటున్నారు వైద్యులు.

మానసిక ప్రశాంతత పెంపొందించుకోవాలి..

పరీక్షల సమయంలో మానసిక ప్రశాంతతను పెంపొందించుకోవాలి. మానసిక ఒత్తిడి తగ్గించుకునేందుకు వ్యాయామం, యోగా, తదితర వాటిపై కూడా దృష్టి సారించాలని మానసిక నిపుణులు సూచిస్తున్నారు. పరీక్షల సమయం దగ్గర పడుతున్న తరుణంలో ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని తెలియజేస్తున్నారు. మంచి ఆహార అలవాట్లు పాటిస్తే రోజంతా అలసట లేకుండా విద్యార్థులు ఉత్సాహంగా చదువుకోవచ్చని చెబుతున్నారు. రోజంతా పుస్తకాలతో కుస్తీ పట్టినా ఉదయం, సాయంత్రం వేళల్లో కనీసం అరగంట సేపు అయినా వ్యాయామం, యోగా చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఆత్మస్థైర్యాన్ని నింపాలి..

విద్యార్థుల తల్లిదండ్రులు ఈ సమయంలో పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ వారికి అందుబాటులో ఉంటూ ఆత్మస్థైర్యాన్ని కలిగించాలి. రాత్రి పూట తొందరగా నిద్రించేలా చేసి వేకువజామునే చదివేలా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని నిపుణులు చెబుతున్నారు. చదువుకునేందుకు ప్రశాంత వాతావరణం కల్పించాలి.

- మంచి ఆహార నియమాలు తప్పనిసరి..
- ఎక్కువగా నీరు తీసుకోవాలి. శీతల పానీయాలకు దూరంగా ఉండాలి. నీరసం అనిపిస్తే కొబ్బరి నీరు తాగడం మంచిది.
- విద్యార్థులు రోజూ 300 ఎం.ఎల్ కొబ్బరినీరు, గ్లూకోజ్ వాటర్, ఉప్పు కలిపిన మజ్జిగ తీసుకోవాలి. నీరు అధికంగా ఉండే పుచ్చకాయ, బత్తాయి రసాలను సేవించాలి. కాచీ చల్లార్చిన నీటిని తాగడం ఉత్తమం. చదువులో ఏకాగ్రత పెరగాలంటే పాలతో పాటు ప్రతిరోజూ ఒక అరటిపండు తీసుకోవాలి. ఉదయం టీ, కాఫీ కంటే రాగిజావ తాగడం ఉత్తమం. ఫాస్ట్‌ఫుడ్‌కు పూర్తిగా దూరంగా ఉండాలి.

సమయానికి భోజనం చేయాలి



పరీక్షల సమయంలో సమయానికి విద్యార్థులు భోజనం చేయాలి. ఎనిమిది గంటలు నిద్రపోవాలి. ఎక్కువగా మంచినీరు తాగాలి. అప్పుడే ఏకాగ్రత పెరుగుతుంది. చదివిందంతా గుర్తుంటుంది. వేకువజామున చదివితే ఇంకా మంచిది.

– చాందిని, వైద్యాధికారి, కుశిమి

భయం వీడాలి..



పబ్లిక్ పరీక్షలంటే ముందుగా భయం వీడాలి. పాఠశాలల్లో రాసే సాధారణ పరీక్షలు గానే విద్యార్థులు భావించాలి. భయపడాల్సిన అవసరం లేదు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. 15 నిమిషాల పాటు ప్రశ్నపత్రం చదివి అర్థం చేసుకున్న తర్వాత సమాధానాలు రాయడం మొదలు పెట్టాలి.

– బి.ఉమావాణి, హెచ్‌ఎం, హడ్డుబంగి ఆశ్రమపాఠశాల



హడ్డుబంగి ఆశ్రమపాఠశాలలో స్టడీ అవర్స్‌లో విద్యార్థినులు

పకడ్బందీగా ఆర్బీఎస్‌కేను నిర్వహించాలి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): పకడ్బందీగా ఆర్బీఎస్‌కే(రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం)ను నిర్వహించాలని ఆ కార్యక్రమ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రఘుకుమార్ సూచించారు. కురుపాం మండలంలోని మొండెంఖల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వలసబల్లేరు గ్రామంలో ఆర్బీఎస్‌కే కార్యక్రమంపై శుక్రవారం ఆరాతీశారు. అలాగే హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో రికార్డులు పరిశీలించి, ఆర్‌బీఎస్‌కే నమోదు ఏ మేర చేపట్టారో తనిఖీ చేశారు. పుట్టినప్పటి నుంచి 18 ఏళ్ల వయసు వరకు గల పిల్లల్లో వచ్చే వ్యాధులు, లోపాలు, వైకల్యాలు, అభివృద్ధి అలస్యం వంటి వాటిని గుర్తించాలని, తద్వారా తగిన వైద్యం సకాలంలో అందించి ఆయా లోపాలు సరిచేయవచ్చని సిబ్బందికి తెలిపారు.



రికార్డులు తనిఖీ చేస్తున్న ఆర్బీఎస్‌కే కార్యక్రమ ప్రోగ్రాం ఆఫీసర్ రఘుకుమార్

ఆదర్శగ్రామంగా మనుమకొండ

- ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

భామిని: మండలంలోని మనుమకొండను ఏస్పిరేషన్ బ్లాక్ ప్రోగ్రాం కింద నీతి ఆయోగ్ సంస్థ ఆదర్శ గ్రామంగా ఎంపిక చేసిందని ఐటీడీఏ పీఓ యశ్వంత్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు మనుమకొండ గ్రామాన్ని శుక్రవారం ఆయన సందర్శించి, గిరిజనులతో మాట్లాడారు. ప్రభుత్వ గిరిజన పాఠశాలను సందర్శించి గిరిజన విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థుల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని హెచ్‌ఎంను సూచించారు. పీఎం జన్‌మాన్ గృహాల నిర్మాణాలు, ఆయుష్మాన్ భారత్ కార్డ్స్ సర్వేపై ఆరాతీశారు. గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు శ్మశానవాటికకు రోడ్డు సౌకర్యం కల్పిస్తానని హామీ ఇచ్చారు. అలాగే సమీప కొత్తూరుగూడ నుంచి మనుమకొండకు రోడ్డు నిర్మించాలని సర్పంచ్ నిమ్మల కేశవ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు నిమ్మల కోరా కోరారు. అనంతరం బత్తిలి పీహెచ్‌సీని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ వై.సత్యం, సీడీపీఓ శాంతి భవానీ, ఏపీఎం చక్రపాణి, ఏపీఓ బాబూరావు, ఏఈలు అలికాన సందీప్, చంద్రశేఖర నాయుడు, స్థానికులు పాల్గొన్నారు.



మనుమకొండ గిరిజనులతో మాట్లాడుతున్న పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

పక్కాగా ఆరోగ్య సర్వేలు నిర్వహించండి



రోగులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో భాస్కరరావు

జియ్యమ్మవలస: పక్కాగా ఆరోగ్య సర్వేలు నిర్వహించాలని, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి మెరుగైన వైద్యం అందేలా చూడాలని డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు సూచించారు. మండలంలోని రావాడ రామభద్రపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం సందర్శించిన ఆయన.. రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, చేస్తున్న వైద్య పరీక్షలపై ఆరాతీశారు. అంతకుముందు రికార్డులు, మందుల నిల్వలు తనిఖీ చేసి, రికార్డులు సక్రమంగా నిర్వహించాలని, అనారోగ్యంతో ఆస్పత్రికి వచ్చే వారికి సకాలంలో వైద్యసేవలు అందేలా చూడాలని సిబ్బందికి తెలిపారు. అనంతరం అక్కడి రోగులతో మాట్లాడి వారికి అందిస్తున్న వైద్యసేవల తీరును అడిగి తెలుసుకున్నారు.

చిరుధాన్యాల సాగు బాగు



రైతులకు అవగాహన కల్పిస్తున్న సైంటిస్ట్‌లు

సీతంపేట: చిరుధాన్యాల పంటల సాగుకు రైతులు ముందుకు రావాలని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం (చింతపల్లి) ఏడీఆర్ అప్పలస్వామి పిలుపునిచ్చారు. మండలంలోని చిన్నబగ్గ, ఈతమానుగూడ, బిల్లమడ, సంకిలి, కె.గుమ్మడ గ్రామాల్లో రైతులకు కొర్రలు, రాగుల విత్తనాలు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంటల్లో చీడపీడల నివారణ, సేంద్రియ వ్యవసాయ విధానంపై వివరించారు. వరిగడ్డిని కాల్చకుండా కుళ్లబెట్టే పద్ధతిలో గత్తం ఎలా తయారు చేసుకోవాలో రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక వ్యవసాయ పరిశోధనా స్థానం సైంటిస్ట్‌లు లక్ష్మీనారాయణ, జోష్, రైతులు భాస్కరరావు, సురేష్, మోహన్, వెలుగు అసోషియేషన్ ప్రతినిధులు పాలక నాగేశ్వరరావు, ఉమాలావణ్య, మిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

మార్చి 6న ధర్నా



కరపత్రాలు విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

గుమ్మలక్ష్మీపురం: ఆశకార్యకర్తలు, కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల డిమాండ్‌ల సాధనకు విజయవాడలో మార్చి 6వ తేదీన నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు కె.గౌరీశ్వరరావు, ఎం.రమణ, ఇందిరలు కోరారు. ఇదే విషయమై రూపొందించిన కరపత్రాలను స్థానిక గిరిజన సంఘ కార్యాలయం వద్ద శుక్రవారం ఆవిష్కరించారు. ఆశ కార్యకర్తల సమస్యలపై గత ప్రభుత్వంతో చర్చలు జరిగి ఒప్పంద కాపీ విడుదలై ఏడాది కాలం దాటిందని అయితే ఇప్పటి కూటమి ప్రభుత్వం అప్పటి ఒప్పందానికి సంబంధించి జీవో జారీ చేయలేదన్నారు. సదరు కార్యకర్తలపై పని ఒత్తిడి, భారం పెరిగిందని, గర్భిణులైన కార్యకర్తలకు మెటర్నిటీ లీవ్ కూడా మంజూరు చేయడం లేదన్నారు. వర్తింపజేస్తామన్న పీఎంజేఏబీవై కూడా వర్తింపజేయడం లేదని, 60 ఏళ్ల వయసుకే రిటైర్‌మెంట్ కూడా ఇచ్చేస్తున్నారన్నారు. సదరు కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని, ఏఎన్‌ఎం శిక్షణ పొందిన వారిని పర్మినెంట్ చేయాలని కోరారు.

నిఘా నీడలో ఇంటర్ పరీక్షలు

సీతంపేట: నిఘా నీడలో శనివారం నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. మండల కేంద్రంలోని గిరిజన బాలుర గురుకుల జూనియర్ కళాశాల, బాలికల కళాశాలల్లో పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. బాలుర కళాశాలలో ప్రథమ ఇంటర్ విద్యార్థులు 395 మంది, 206 మంది సీనియర్ ఇంటర్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని చీఫ్ సూపరింటెండెంట్ కృష్ణమోహన్ తెలిపారు. అలాగే బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో ఫస్టియర్ విద్యార్థులు 347 మంది, సెకెండ్ ఇయర్ విద్యార్థులు 272 మంది పరీక్ష రాయనున్నారని చీఫ్ సూపరింటెండెంట్ పి. సూర్యకుమారి తెలిపారు.

పక్కాగా ఏర్పాట్లు ..

పాలకొండ రూరల్: ఉన్నతాధికారుల సూచనలతో ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పరీక్షల నిర్వహణ చీఫ్ సూపరింటెండెంట్లు తెలిపారు. డివిజన్ కేంద్రమైన పాలకొండలో ప్రభుత్వ జూనియర్ బాలుర కళాశాలలో 375 మంది, బాలికల జూనియర్ కళాశాలలో 271 మంది, తమ్మినాయుడు కళాశాలలో 220, ఎలైట్ కళాశాలలో 165, శ్రీ సత్యసాయి కళాశాలలో 161, శ్రీ కేశవసాయి జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో 184 మంది శనివారం ఉదయం పరీక్షకు హాజరుకానున్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు అరగంట ముందుగా చేరుకోవాలని చీఫ్ సూపరింటెండెంట్లు బి.గోవిందరావు, యు.సత్యప్రభ, ఎ.గోవిందరావు, ఎం.కుమారస్వామి, ఎర్రంనాయుడు, ఉదయ్‌కుమార్, తదితరులు తెలిపారు.

– 144వ సెక్షన్ అమలు

వీరఘట్టం: ఇంటర్మీడియట్ పరీక్షలు సీసీ కెమెరాల నిఘాలో జరగనున్నాయి. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో మొత్తం 11 గదుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. 248 మంది ఫస్టియర్, 258 మంది సెకెండియర్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని ప్రిన్సిపాల్ డీవీఎస్ త్రినాథ తెలిపారు. ఇదిలా ఉంటే పరీక్ష కేంద్రాల వద్ద 144వ సెక్షన్ విధిస్తున్నట్లు ఎస్సై జి. కళాధర్ తెలిపారు.

గుమ్మలక్ష్మీపురం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల(ఎస్టీ), భద్రగిరి ఏపీటీడబ్ల్యూఆర్ జూనియర్ కళాశాలలు(బాలురు/బాలికలు),ల్లో శనివారం నుంచి ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌లు, ప్రిన్సిపాళ్లు కె.సుధాకర్, యుగంధర్, సత్యవతిలు శుక్రవారం తెలిపారు.



వీరఘట్టం : జూనియర్ కళాశాలలో ఓ గదిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

2100 గృహాలు మంజూరు

వీరఘట్టం: ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) 2.0 పథకం ద్వారా మండలానికి 2100 గృహాలు మంజూరైనట్లు గృహ నిర్మాణశాఖ ఏఈ వినోద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులు ఆధార్ కార్డు జిరాక్స్‌లు, రైస్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్, కులం, ఆదాయ ధ్రువ పత్రాలు, పొజిషన్ సర్టిఫికెట్, ఆధార్‌కు లింక్ అయిన ఫోన్ నంబర్, తదితర వివరాలతో ఈనెల 5వ తేదీలోపు హౌసింగ్ కార్యాలయం లేదా మీ పరిధిలోని సచివాలయాల్లో సంప్రదించాలని కోరారు.

విజ్ఞాన ప్రదర్శనలతో సృజనాత్మకత వెలికితీత..



వీరఘట్టం: హుస్సేనుపురం పాఠశాలలో ఆకట్టుకున్న విద్యార్థుల సైన్స్ ప్రదర్శనలు

- డిప్యూటీ డీఈఓ కృష్ణమూర్తి

పాలకొండ రూరల్: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు సైన్స్ విజ్ఞాన ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయని డిప్యూటీ డీఈఓ పి.కృష్ణమూర్తి అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని రవీంద్రభారతి విద్యాసంస్థల్లో విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్ట్‌లను ఎంఈఓ కె. సోంబాబు, తదితరులతో కలిసి సందర్శించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల ప్రతినిధులు ఎన్.వెంకటేష్, భవానీప్రసాద్, సీహెచ్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా సైన్స్ డే

సీతంపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైన్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సైన్స్ అధ్యాపకుడు బి.నరేష్ మాట్లాడుతూ.. శాస్త్ర సాంకేతిక విజ్ఞానంలో విద్యార్థులు దూసుకుపోవాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ ప్రభాకర్ పాల్గొన్నారు.

రామన్‌కు ఘన నివాళులు..

భామిని: మండలంలోని పలు పాఠశాలల్లో జాతీయ సైన్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. భౌతికశాస్త్ర పితామహుడు సర్ సీవీ రామన్ రామన్ ఎఫెక్ట్ ఆవిష్కరించిన రోజు కావడంతో జాతీయ సైన్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు పలు ప్రాజెక్ట్‌లను ప్రదర్శించారు.

బుల్లి శాస్త్రవేత్తలు.. బోలెడన్ని ఆలోచనలు

వీరఘట్టం: బుల్లి శాస్త్రవేత్తలు తమ ఆలోచనలకు పదునుపెట్టారు. మండలంలోని అన్ని విద్యాసంస్థలలో వైజ్ఞానిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణ, ఆరోగ్య సమాచారం, ప్లాస్టిక్ నిషేధం, వర్మీ కంపోస్టుల తయారీ, తదితర ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. హుస్సేనుపురం,రేగులపాడు కేజీబీవీ, కంబరవలస, వీరఘట్టం, కత్తులకవిటి, తలవరం, బిటివాడ, వండవ పాఠశాలల్లో సైన్స్ డే నిర్వహించారు.

జియ్యమ్మవలస/గుమ్మలక్ష్మీపురం: జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకుని, మండలాల్లోని పలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కళాశాలల్లో సైన్స్ విజ్ఞాన ప్రదర్శనలు చేపట్టారు. వివిధ అంశాలకు సంబంధించి మొత్తం 47 ప్రయోగాలను విద్యార్థులు రూపొందించి, ప్రదర్శించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు.



గుమ్మలక్ష్మీపుం కేజీబీవీలో విద్యార్థుల విజ్ఞాన ప్రదర్శనను తిలకిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీరంజని



జియ్యమ్మవలస: సైన్స్ ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ఉపాధ్యాయులు



పాలకొండ రూరల్: విద్యార్థులు ఆవిష్కరించిన ప్రాజెక్ట్‌ల ఆవశ్యకతను తెలుసుకుంటున్న డీప్యూటీ డీఈఓ కృష్ణమూర్తి, ఎంఈఓ, తదితరులు



భామిని: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో సీవీ రామన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టీచర్లు, విద్యార్థులు

ఘనంగా చక్రతీర్థ స్నానాలు



మండలంలోని సొలికిరిలో వెలిసిన అన్నపూర్ణ సహిత కాశీవిశ్వేశ్వర స్వామి చక్రతీర్థ స్నానాలు శుక్రవారం పవిత్రంగా నిర్వహించారు. ముందుగా దేవతా ఉత్సవ విగ్రహాలను మేళతాళాలతో ఊరేగించి, వంశధార నదిలో స్నానాలాచరించారు. అనంతరం ఉత్సవమూర్తులను ఆలయానికి తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

భామిని



జంగిల్ క్లియరెన్స్..

పాలకొండ మండలంలోని పనుకువలన సమీపంలో విద్యుత్ సిబ్బంది శుక్రవారం జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. దీంతో అటు వీరఘట్టం ఇటు పాలకొండ మండలాల్లోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఏఈ శ్యామ్ సుందర్ ఆధ్వర్యంలో సిబ్బంది త్వరితగతిన పనులు చేపట్టారు.

– పాలకొండ రూరల్